మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, ఫిబ్రవరి 7: ఆచంపల్లికి చెందిన మాజీ ఎంపీపీ గంగాధర శంకర్ అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ ప్రతిమా దవాఖానలో చికిత్స పొందుతుండగా, బుధవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. శంకర్‌కు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రూ.1,18,116 విరాళం

చొప్పదండి, ఫిబ్రవరి 7: పట్టణంలోని వేంకటేశ్వర మణికంఠ ఆలయంలో అన్నదానం కోసం పట్టణానికి చెందిన మహేశ్ సూపర్ మార్కెట్ యజమాని పైడ మహేశ్, అర్చన దంపతులు రూ.1,18,116 ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బొడిగె వెంకన్న, కోశాధికారి దండె సత్యానందం, ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, వెల్మ విజేందర్ రెడ్డి, కట్ట సత్యం ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

గంగాధర, ఫిబ్రవరి 7: ఉప్పరమల్యాలలోని సీతారామస్వామి ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆల య ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని కోరగా, రూ.5 లక్ష ల నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

304 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మానకొండూర్, ఫిబ్రవరి 7: అక్రమంగా తరలిస్తున్న 304 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం మానకొండూర్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన తడక సతీశ్ 304 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని లారీలో వరంగల్ నుంచి నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం మానకొండూర్ చెరువు కట్ట వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. బియ్యాన్ని పోలీసులు వెంటనే సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. సివిల్‌సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు వరంగల్‌కు చెందిన తడక సతీశ్, నరేశ్, మహారాష్ట్రలోని అమరావతికి చెందిన షేక్ అన్వర్ (లారీ డ్రైవర్), నాందేడ్‌కు చెంద న గణేశ్‌గోడ్ బీరేష్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిందితుడు నరేశ్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

బాలికలు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి

- జాతీయ బాలికా దినోత్సవంలో కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 7: బాలికలు తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ, తమ ఎదుగుదలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం-2024లో భాగంగా నగరంలోని బాలలకు జ్యోతిబాపూలే మైదానంలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుప్రాయంలోనే జీవిత లక్ష్యం ఎంచుకునే స్థాయికి నేటి తరం బాలలు ఎదిగారని ప్రశంసించారు. బాలికలు ప్రతి కార్యక్రమంలో ధైర్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలని, ఇటీవల ప్రయోగించి విజయవంతమైన చంద్రయాన్-3లో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. బాలికా సాధికారత దిశగా జిల్లాలో స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి బాలిక ఒక మొక్కను నాటాలని కోరారు. చిత్రలేఖనం పోటీల్లో కలెక్టర్ కూడా పాల్గొని ఓ చిన్నారి చిత్రాన్ని గీశారు. ఈ పోటీల్లో 261 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్, సంక్షేమ శాఖ జిల్లా అధికారి సరస్వతి, మార్కెటింగ్ శాఖ అధికారి పద్మావతి, డీఈవో జనార్దన్‌రావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతిగా సైకిల్‌ను అందజేస్తున్న కలెక్టర్

కొనసాగుతున్న ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈవీఎంల గోడౌన్‌లో ఈనెల 5 నుంచి ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తుండగా, బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి పర్యవేక్షించారు. ఎఫ్ఎల్‌సీ, వెబ్‌కాస్టింగ్, ఈవీఎంలను భద్రపరచడం, వెబ్‌కాస్టింగ్ గదులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యం జీవితంలో క్రీడలు భాగం కావాలి

కొత్తపల్లి, ఫిబ్రవరి 7: నిత్యజీవితంలో యువతకు క్రీడలు భాగం కావాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన హాస్టల్ విద్యార్థుల క్రీడా పోటీలను ఆమె జ్యోతిప్రజ్వలన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి అనిల్ ప్రకాశ్, సాంఘిక, సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నతానియేల్, క్రీడల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి రాజవీరు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి

చిగురుమామిడి, ఫిబ్రవరి 7: లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. బుధవారం ఆమె చిగురుమామిడి మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలో ఆయిల్ పామ్ నర్సరీని, బొమ్మనపల్లిలో ఈజీఎస్ ద్వారా సాగు చేసిన మామిడి తోట, ఇందుర్తిలో సంపద వనాన్ని సందర్శించారు. బొమ్మనపల్లిలో ఈజీఎస్ ద్వారా మూడు ఎకరాల్లో మామిడి తోటసాగు చేస్తున్న రైతు గంప సతీశ్‌ను అభినందించారు. ఇందుర్తి సంపద వనాన్ని మరింత అభివృద్ధి చేయాలని అధికారులను అదేశించారు. బొమ్మనపల్లి, ఇందుర్తి ఈజీఎస్ పనులపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి, మండల ప్రత్యేకాధికారి నతానియేల్, డీఆర్డీవో శ్రీలత, ఎంపీపీ వినీత, అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి, ఉద్యానవన డివిజన్ అధికారి మంజువాణి, ఎంపీడీవో నర్సయ్య, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి, ఎంపీవో శ్రవణ్ కుమార్, లోహియా కంపెనీ మేనేజర్ భరత్, ఇన్‌చార్జి ఏపీవో రాజయ్య, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, వెంకటరమణ, రమణారెడ్డి, ఈజీఎస్ టీఏలు అంజలి, వెంకటేశ్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- దళితబంధు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి భరోసా
- వీణవంకలో ఆత్మహత్యకు యత్నించిన అమలకు పరామర్శ

వీణవంక, ఫిబ్రవరి 7: దళితబంధు పథకం కింద రెండోవిడుత డబ్బులు రాలేదని లబ్ధిదారులు అధైర్యపడి అఘాయిత్యాలకు పాల్పడొద్దని, వారి కుటుంబాలకు తాను అండగా ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో దళిత బంధు రెండు విడుత డబ్బులు రాలేదని లబ్ధిదారు గాజుల అమల ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా, బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో నాలుగు వేల కుటుంబాలకు దళిత బంధు రెండో విడుత డబ్బులు రావ్వాల్సి ఉందన్నారు. దళితబంధు లబ్ధిదారుల ఖాతాలు ఎందుకు ఫ్రీజ్ చేశారో చెప్పాలన్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని దళితులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన గెల్లు అశోక్ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట వైస్ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ భానుచందర్, నాయకులు గెల్లు కొమురయ్య, దాసారపు కృష్ణచైతన్య, గెల్లు కుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

వీణవంకలో దళితబంధు లబ్ధిదారు గాజుల అమలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

మూసి ఉన్న పాఠశాలను చూపుతున్న ఎంపీడీవో మల్లోత్త తదితరులు

పదిన్నర దాటినా తెరచుకోని బడి

గంగాధర, ఫిబ్రవరి 7: మంగపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో ఎన్ఆర్ మల్లోత్త, పంచాయతీ సిబ్బంది సందర్శించారు. ఉదయం 10:39 గంటలు దాటినా ఉపాధ్యాయులు ఎవరూ పాఠశాలకు రాలేదని, కనీసం స్కూల్‌ను తెరవకపోవడంతో విద్యార్థులు ఆరు బయట ఆడుతున్నారని ఎంపీడీవో తెలిపారు. ఉపాధ్యాయులపై చర్యలకు ఎంఈవోకు రెఫర్ చేసినట్లు తెలిపారు.

పారమితలో వీడ్కోలు సంబురాలు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7: కార్పొరేషన్ పరిధిలోని అల్లగూర్ పారమిత వరల్డ్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు 'స్వస్తి' వేడుకలు అట్టహాసంగా సాగాయి. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద రావు

అలరించిన స్వాగతోత్సవం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మనోహర్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కాలేజ్ ఆధ్వర్యంలో డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతోత్సవం అలరించింది. శాతవాహన యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ యూజీసీ సెల్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరై, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల చైర్మన్ కరస్పాండెంట్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రత్న గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సతీశ్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'వాగేశ్వరి'లో డాటా అనలిటిక్స్‌పై వర్క్‌షాప్

తిమ్మాపూర్, ఫిబ్రవరి7: రామకృష్ణకాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, పేపాల్ ఫౌండేషన్ సంయుక్తంగా మూడు వారాల పాటు నిర్వహించే సర్టిఫికెట్ కోర్స్ ఆన్ డాటా అనలిటిక్స్ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ, ఐసీటీ అకాడమీ తెలంగాణ హెడ్ గోపాల్ పాల్గొని విద్యార్థులకు కోర్సుకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయండి

రాంనగర్, ఫిబ్రవరి 7: బాధిత మహిళలు మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయడానికి ముందుకు రావాలని కరీంనగర్ షీ టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీలత సూచించారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు షీటీం బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వేధింపులకు గురైన వారు వెంటనే '100'కు లేదా షీటీం వాట్సాప్ నెంబర్ (8712670759)కు ఫిర్యాదు చేయాలన్నారు. షీటీం ఏఎస్ఐ విజయమణి, షీ టీం సభ్యులు పాల్గొన్నారు.

అర్చక సంఘ సమావేశం

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 7: తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా స్థాయి సమావేశం నగరంలోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తిరునగరి వెంకటాద్రిస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం సభ్యులకు గుర్తింపు కార్డులు ఇప్పిస్తామంటూ సంఘం పేరుతో సతీశ్ శర్మ, ఉపేందర్‌శర్మ అర్చకుల నుంచి డబ్బు వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. వీరికి సంఘానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. సమావేశంలో సంఘం రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లా అధ్యక్షులు సంతోష్, మాధవాచారి, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బస్కాంగి శంకరయ్య నాయకులు పాల్గొన్నారు.

చేపలు పట్టుకునే విషయంలో తగాదా

శంకరపట్నం, ఫిబ్రవరి 7: కరీంపేట్ ఊర చెరువు వద్ద కేశవపట్నం ముదిరాజ్ కులస్తులకు, కరీంపేట్ గ్రామస్తులకు మధ్య చేపలు పట్టుకునే హక్కుల విషయమై తగాదా ఏర్పడింది. కరీంపేట్‌లో ముదిరాజ్ కులస్తులు లేకపోవడంతో చేపలు పట్టుకునే హక్కు కేశవపట్నం ముదిరాజ్‌లకు సంక్రమించింది. కాగా, బుధవారం కరీంపేట్ చెరువు వద్దకు చేపలు పట్టడానికి వచ్చిన కేశవపట్నం ముదిరాజ్ కులస్తులతో కరీంపేట్ గ్రామస్తులు తగాదా పడ్డారు. తమ చెరువులో వేరే ఊరి వారిని చేపలు పట్టనీయమని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఒకరినొకరు నెట్టివేసుకోగా, ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కొందరు సర్ది చెప్పడంతో కేశవపట్నం ముదిరాజ్ కులస్తులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

ఆత్మగౌరవాన్ని నిలిపేందుకే కుల సంఘం భవనాలు

కార్పొరేషన్, ఫిబ్రవరి 7: కుల సంఘాలు ఆత్మగౌరవంతో ఉండేలా సొంత భవనాలు నిర్మాణం చేస్తున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 14వ డివిజన్ సప్తగిరి కాలనీ గంగాపరమేశ్వర ఆలయంలో రూ.21 లక్ష ల నిధులతో చేపట్టే ప్రహరీ, పెట్టర్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. గంగాపరమేశ్వర స్వామికి ప్రత్యే క పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సహకారంతో నగరంలో కులాల ఆత్మగౌరవాన్ని నింపేలా సంఘం భవనాలను నిర్మించి కుల సంఘాలను బలోపేతం చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్, జయశ్రీ శ్రీనివాస్, చాడగొండ బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ సుందరీకరణపై సమావేశం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని 33 వ డివిజన్ పరిధిలోని జడ్పీ క్వార్టర్స్ సమీపంలో ఉన్న హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయాన్ని బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు సందర్శించారు. అయ్యప్ప ఆలయ సుందరీకరణపై సమావేశం నిర్వహించారు. అయ్యప్ప ఆలయం ఆధునీకరణ పనులకు సంబంధించిన మ్యాప్ పరిశీలించి, అభివృద్ధి పనులపై ఆలయ ఈవో కాంతారెడ్డి, అర్చకులతో చర్చించారు.

14వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్

పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరియాలి

వీణవంక/కొత్తపల్లి/జమ్మికుంట, ఫిబ్రవరి 7: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరియాలని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం వీణవంక, జమ్మికుంట మండల కేంద్రాల్లో, కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో ఆయన పర్యటించారు. వీణవంకలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయం భవనాన్ని పరిశీలించి, గ్రామ సభకు హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాలు, సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాన్ని పరిశీలించారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి పారిశుధ్య కార్యక్రమాలను స్వయంగా పరిశీలించి ప్రత్యేక అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే జమ్మికుంట పట్టణంలో కలియతిరిగారు. ముందుగా పట్టణ శివారులోని మూతపడిన మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించారు. తిరిగి తెరిపించేందుకు సన్నద్ధమవుదామని అధికారులకు చెప్పారు. అనంతరం గ్రంథాలయాన్ని పరిశీలించారు. తర్వాత వీధి వ్యాపారుల మడిగల కోసం వీణవంక రోడ్డు రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, మున్సిపల్ ఏరియాలను పరిశీలించారు. త్వరలో మడిగల కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, ఆర్డీవో రాజు, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు, కమిషనర్ శ్రీనివాస్, యూనిసెఫ్ ప్రాజెక్టు సమన్వయకర్త కిషన్‌స్వామి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం
- ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొన్న కారు
- కొత్తగట్టు ఆలయ గుట్ట వద్ద ఘటన

శంకరపట్నం, ఫిబ్రవరి 7: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ గుట్ట వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు గాయపడగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ కోతిరాంపూర్‌లోని పోచమ్మ వాడకు చెందిన తాళ్ల సదానందం తన కారులో స్నేహితుడు నీర్ల ప్రభాకర్ (58)తో కలిసి ఓ పనిపై విజయవాడకు బయల్దేరారు. సదానందం తల్లి కొమురమ్మ(65), సోదరి గీత హనుమకొండలోని బంధువుల ఇంటికి అదే కారులో వెళ్తున్నారు. కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ గుట్ట దాటుతుండగా రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కొమురమ్మ, ప్రభాకర్ అక్కడికక్కడే మరణించారు. గీతకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం హుజూరాబాద్‌కు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కారును నడుపుతున్న సదానందం స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను హుజూరాబాద్ దవాఖానకు తరలించారు. కాగా, పొగ మంచు ప్రభావం, టిప్పర్ డ్రైవర్ పార్కింగ్ లైట్లు వేయకపోవడమే ప్రమాదానికి కారణమని తెలుస్తున్నది. ప్రభాకర్ భార్య నీర్ల సబిత ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ మంజునాథ కిల్లగుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

వితరణ చేసిన బుక్స్‌తో విద్యార్థులు

పాఠశాలకు పుస్తకాల వితరణ

చిగురుమామిడి, ఫిబ్రవరి 7: రామంచ జడ్పీ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయానికి హిందీ ఉపాధ్యాయుడు, ఉన్నతి హిందీ రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యుడు షరీఫ్ అహ్మద్ రూ. 5 వేల విలువచేసే పుస్తకాలు (పిల్లల కథలు, జనరల్ నాలెడ్జ్, హిందీ సాహిత్యం) వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు దామోదర్ మాట్లాడుతూ, పుస్తక పఠనం ద్వారా పిల్లలు పరిపూర్ణవంతులవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజిరెడ్డి, రేవతి, రాయమల్లు, దేవేందర్ రెడ్డి, రాజకుమారి పాల్గొన్నారు.

సీసీ రోడ్డును తనిఖీ చేసిన డీఆర్డీవో

కొత్తపల్లి, ఫిబ్రవరి 7: ఆసీఫ్‌నగర్‌లో నాణ్యత లేకుండా నిర్మిస్తున్న సీసీ రోడ్డును డీఆర్డీవో శ్రీలత బుధవారం పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్నారని, గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే డస్ట్‌ను సీసీ రోడ్డు కింది భాగంలో పోస్తుండడంతో అది కుంగిపోయే పనికిరాకుండా పోతుందని ఎంపీటీసీ, గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్డీవో శ్రీలత సీసీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించి నివేదికను పైఅధికారులకు నివేదిస్తామన్నారు.

'మధ్యాహ్న భోజనం'లో పురుగులు పట్టిన బియ్యం

- ప్రత్యేకాధికారి తనిఖీలో వెలుగులోకి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 7: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు పట్టిన బియ్యాన్ని ఉపయోగిస్తున్న విషయం గ్రామ ప్రత్యేకాధికారి తనిఖీలో వెలుగు చూసింది. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామాన్ని ప్రత్యేకాధికారి రామకృష్ణ సందర్శించారు. గ్రామ సభ అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. శానిటేషన్ పనులపై చర్చించారు. తర్వాత స్టోర్ రూమ్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం బియ్యం పరిశీలించగా, 18 బస్తాలు పురుగులు పట్టి నాణ్యత లేకుండా కనిపించాయి. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. దీంతో ప్రత్యేకాధికారి వెంటనే ఎంఈవో మధుసూదనాచారికి ఫోన్ చేసి మాట్లాడారు. బియ్యాన్ని మార్చి పంపాలని కోరారు.

స్కూల్‌లో పురుగుల పట్టిన బియ్యం సంచులు

వలంటీర్‌కు సత్కారం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ మారుపాక కీర్తి ఢిల్లీ గణతంత్ర దినోత్సవ కవాతులో పాల్గొనగా, ఆమెను శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య మనోహర్ సత్కరించి, అభినందించారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ప్రోగ్రాం అధికారులు సురేశ్‌కుమార్, నాయుడు, చంద్రమౌళి, వలంటీర్ తల్లి శారద తదితరులు ఉన్నారు.

పోలీస్ కస్టడీకి భూ ఆక్రమణదారులు

రాంనగర్, ఫిబ్రవరి 7: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, అక్రమంగా భూకబ్జాకు పాల్పడిన మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్‌ను ఈనెల 1న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. కాగా ఈ కేసులో తదుపరి విచారణ కోసం కరీంనగర్ రూరల్ పోలీసులు నిందితులిద్దరిని కరీంనగర